కథా కౌముది

# జాలువారని కన్నీరు

సన్నిహిత్

**వేకువ జాము నాలుగ్గంటల సమయం!**

మంచి నిద్రలో అందమైన కలలు కంటుంటే ‘జగమంత కుటుంబం నాది…ఏకాకి జీవితం నాది ‘ అంటూ సెల్‌ఫోన్ రింగవసాగింది.

ఇప్పుడెవడ్రా బాబూ అనుకుంటూ లిఫ్ట్ చేసి , కళ్ళు తెరవకుండానే " హలో… ఎవరూ ? " అన్నాను.

" బాబూ…నేను … అమ్మని" అని వినబడే సరికి ఎలర్ట్ అయి " చెప్పమ్మా…ఏంటి విషయం? " అనడిగాను.

" నాన్న…మీ నాన్న…చనిపోయారు బాబూ!" బలహీనంగా చెప్పింది. అదిరి పడ్డాను. ఒక నమ్మలేని నిజం వింటున్నట్లుగా విపరీతమైన ఆశ్చర్యానికి లోనయ్యాను. ‘ఇది నిజం కాకపోతే ఎంత బాగుండును‘ అనిపించింది. నన్ను నేను కోల్పోయినట్లయి గొంతు తడారిపోయింది.

నిజానికిది నేను అంత షాక్ అవ్వాల్సిన విషయం కాదు. ఎందుకంటే అనారోగ్యంతో బాధ పడుతున్న నాన్నని రెండు రోజుల క్రితమే దగ్గరలో ఉన్న వైజాగ్ సిటీలోని ‘అపోలో‘ హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న నేను విపరీతమైన పని ఒత్తిడితో(?) వెంటనే వైజాగ్ వెళ్ళలేక పోయాను. అన్ని విషయాలు జాగ్రత్తగా చూసుకోమని మా అమ్మకి ఆర్డర్ వేసాను. అక్కడితో నా బాధ్యత తీరిపోయిందన్నట్లు సంతృప్తి పడ్డాను. ఈ రోజుల్లో అందరి కొడుకులు అంతే కదా!

రెండు కిడ్నీలు ఫెయిల్ అయి డయాలసిస్ మీద ఉన్న నా తండ్రి ఏ క్షణమైనా చనిపోవచ్చని మా అందరికీ తెలుసు. అయినా సరే నా తండ్రి మరణ వార్త వినగానే సహజ సిద్ధమైన షాక్‌కి లోనయ్యాను.

" సరేనమ్మా! … నేను వెంటనే బయలు దేరి వస్తాను… ఈ లోగా నీవు జరగవలసిన కార్యక్రమాలు చూడు" అని ఫోన్ పెట్టేసాను.

వైజాగ్ ఎయిర్ పోర్ట్‌లో ఫ్లైయిట్ దిగి, అక్కడినుండి బస్ పట్టుకొని మా ఊరు చేరుకొనేటప్పటికి టైము పొద్దున్న పది అయింది. ఇంటిముందు టెంట్ వేసి ఉంది. అందులో ఫ్రీజర్ బాక్స్‌లో నాన్న పార్థివ శరీరం! నన్ను చూడగానే అందరూ గట్టిగా ఏడవడం మొదలు పెట్టారు. దగ్గరకు వెళ్ళి చూసాను. చని పోయిన నా తండ్రి ముఖం ప్రశాంతంగా నిద్ర పోతున్నట్లుగా ఉంది. భగవంతుడు తనకు అసైన్ చేసిన పనులన్నిటినీ సక్సెస్‌ఫుల్‌గా నిర్వర్తించి ఈ లోకం నుండి నిష్క్రమించిన సంతృప్తి కనిపిస్తోంది. అలాగే చూస్తూ ఉండిపోయాను. మనసంతా ఏదో వర్ణించలేని బాధ!

"ఒరేయ్! అబ్బాయి వచ్చేసాడు కదా...ఇక జరగవలసిన పనులు మొదలుపెడదాం" అని ఎవరో అన్నారు. ఆ తర్వాత దహన సంస్కారాలన్నీ ఒక్కొక్కటిగా జరిగి పోయాయి.

ఆ సాయంత్రం మా ఇంటి మేడ మీద కూర్చొని చుట్టూ చూడ సాగాను. నా బాల్యంలో చిన్న చిన్నగా ఉన్న ఇళ్ళు ఇప్పుడు పెద్ద పెద్ద మేడలు అయ్యాయి. ఊరికి ఎంతో దూరంగా ఉన్నాయనిపించే పంట పొలాలు ఊరు పెరగడంతో దగ్గరయ్యాయి. నాగరికత పెరిగింది. యువకుల చేతుల్లో సెల్ ఫోన్‌లు, తిరగడానికి మోటార్ బైక్‌లు కనిపిస్తున్నాయి. సాధారణంగా పల్లెలో కనిపించే ఆహ్లాదత, ప్రశాంతత తగ్గి హడావుడి పెరిగింది. ఇదే 'అభివృద్ధి ' అనుకుంటే మంచిదే! సర్వేజనా సుఖినోభవంతు!

" ఏంటన్నయ్యా... అలా ఒంటరిగా కూర్చున్నావు?" అంటూ దగ్గరికి వచ్చింది చెల్లి. తను పెళ్ళి అయ్యాక అత్తారింటికి వేరే ఊరు వెళ్ళిపోయింది. ఏదో ఇలా కలిసినప్పుడే ప్రేమగా మాట్లాడటం కుదురుతుంటుంది. ఆప్యాయంగా తలమీద చెయ్యి వేసి నిమిరాను. ఒక్కసారిగా బరస్ట్ అయింది.

" ఊరుకోమ్మా! ఎప్పటికైనా జరగవలసింది ఇదే కదా! నాన్నేమో షుగర్ పేషెంట్. ఈ మధ్య మరీ డౌన్ అయ్యారు. మన చేతుల్లో ఏముంది? ఆ భగవంతుడు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్ళిపోవలసిందే కదా!" అంటూ ఓదార్చాను. నిజానికి నాక్కూడా మనసేమీ బాగాలేదు. ఎన్ని పుస్తకాలు చదివినా, ఎంత ప్రపంచాన్ని చూసినా ఆప్తులు చనిపోయినప్పుడు బాధ పడకుండా ఉండటానికి మనమేమీ 'మహర్షులం' కాదు కదా!.

కొన్ని రోజులు ఊళ్ళోనే ఉండి మిగతా పనులన్నీ పూర్తిచేసుకుని హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణమయ్యాను.

లగేజ్ తీసుకుని బస్ ఎక్కుతుండగా మా మేనమామ ఎవరితోనో అంటున్నాడు." వీడేం కొడుకు రా బాబూ... కష్టపడి పెంచి పెద్ద చేసిన తండ్రి చనిపోతే కనీసం ఒక చుక్క కన్నీరు అయినా కార్చలేదు... ఇప్పుడేమో ఎగురుకుంటూ హైదరాబాద్ వెళ్ళిపోతున్నాడు" అని. నా చెంప మీద ఎవరో బలంగా కొట్టినట్లుగా అదిరి పడ్డాను. బస్ ఎక్కుతూ అనుకున్నాను - " అవున్నిజమే కదా! నాకు కన్నీళ్ళు ఎందుకు రాలేదు? " అని.

●●●

హైదరాబాద్‌లో నేను నివసించే ప్రాంతం సిటీకి కొంచెం దూరంగా అవుట్ స్కర్ట్స్‌లో ఉంటుంది. అద్దె తక్కువగా ఉంటుందని ఆ ఏరియాలో ఉంటున్నాను. నా ఇంటిని ఆనుకుని ' లేబర్ బస్తీ ' ఒకటుంది. రోజూ నేను ఆఫీసు నుండి రూముకి చేరుకునేసరికి సాయంత్రం ఆరవుతుంది. ఆ టైములో బస్తీ వాతావరణం మహా రంజుగా ఉంటుంది. పగలంతా కూలీ నాలీ చేసుకుని బ్రతికే వాళ్ళు, సాయంత్రం కాగానే విపరీతమైన దాహానికి, ఆకలికి లోనవుతారు. దాహం తీరడానికి సారా త్రాగుతారు. ఆకలి తీరడానికి చికెన్ బిర్యానీ తింటారు. అవి అరిగేదాకా తన్నుకుంటారు. పచ్చి బూతులు తిట్టుకుంటారు. మొదట్లో నాకు అసహ్యంగా అనిపించేది. క్రమేణా ఆ జన జీవన సౌందర్యాన్ని చూడ్డానికి అలవాటు పడిపోయాను. రేపటి గురించి చింత లేకుండా 'ఈ రోజు హాయిగా బ్రతికితే చాలు' అన్న వాళ్ళ దృక్పథం నాకు ఈర్ష్య కలిగిస్తుంది.

ఆ రోజు ఎప్పటిలాగే రూముకి చేరుకున్నాక వంట చేసుకున్నాను. తిన్నాక రాత్రి పన్నెండు దాకా చదువుకోవడం నాకు అలవాటు. చదువుకుంటూ టైము చూసుకున్నను. పన్నెండు కావస్తోంది. 'ఇక చాల్లే ' అనుకుని నిద్రకుపక్రమిస్తుండగా "ఓరి నాయనో! ఓరి దేవుడో!" అంటూ విపరీతమైన ఏడుపులు , పెడబొబ్బలు వినబడ్డాయి.

"ఏమైందబ్బా! " అనుకుంటూ బయటకు వెళ్ళి చూసాను. సూరమ్మ భర్త రాములుని ముగ్గురు వ్యక్తులు మోసుకుంటూ తీసుకొస్తున్నారు. అతని ఒంటినిండా రక్తం!. కాళ్ళు, చేతులూ ఆడిస్తూ విపరీతంగా మూలుగుతున్నాడు. సూరమ్మ - నేను

అద్దెకుంటుంటున్న ఇంటి ఓనర్ గారి దగ్గర పనిమనిషి. దాని మొగుడు రాములు రిక్షా తొక్కుతుంటాడు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు. వాళ్ళతో నాకు కొంచెం పరిచయం ఉండటంతో నేను పరిగెత్తుకుంటూ దగ్గరకి వెళ్ళాను.

"సారూ! నా మొగుడ్ని లారీ గుద్దేసినాది సారూ!" అంటూ భోరున ఏడ్చేసింది సూరమ్మ.

ప్రక్కన ఉన్న ఎవడి దగ్గరో సెల్ ఫోన్ లాక్కొని 'నూట ఎనిమిది' సర్వీసుకి ఫోన్ చేసాను. వాళ్ళు వచ్చేదాకా అతన్ని మంచం మీద పడుకోబెట్టమని చెప్పి నా రూములోకి పరిగెత్తుకుంటూ వెళ్ళి పర్సులోనుండి చేతికందిన నోట్లు తీసుకొచ్చి సూరమ్మ చేతిలో పెట్టాను. కాసేపట్లో అంబులెన్స్ వచ్చింది. సూరమ్మకి ధైర్యం చెప్పి హాస్పిటల్‌కి వెళ్ళమని పంపించాను. అంబులెన్స్ వెళ్ళిపోయాక, ఇంకో కూలీ "ఈ రాములు గాడు పక్కా తాగుబోతు నాయాలు సార్! ఈడే పీకల్దాకా తాగి ఆ నారీ కింద పడిపోయుంటాడు" అంటూ నాతో చెప్పి బూతులు తిట్టసాగాడు. నేనేమీ వినకుండా రూముకి వచ్చేసాను. మనసంతా అదోలా అనిపించింది. 'స్టవ్' వెలిగించ్ 'టీ' తయారు చేసుకున్నాను. నెమ్మదిగా సిప్ చేస్తూ ఆలోచించసాగాను. అప్పటికి లేబర్ బస్తీలో అలజడి తగ్గింది. దూరంగా ఎక్కడో ఒక కుక్క దరిద్రంగా ఏడుస్తోంది.

"ఈ రాములుకి ఏదన్నా జరిగితే సూరమ్మ పరిస్థితి ఏంటి? ఆ పిల్లలకు దిక్కెవరు ? " అనిపించింది. ఎందుకో చనిపోయిన మా నాన్న గుర్తొచ్చారు. మనసు లోపల ఏదో తడి! టీ త్రాగడం పూర్తయ్యాక చూస్తే టైము పన్నెండు దాటింది. పొద్దున్న తొందరగా ఆఫీసుకి వెళ్ళాలి కాబట్టి వెంటనే నిద్రకుపక్రమించాను.

●●●

పొద్దుట ఆఫీసుకి వెళుతుంటే తెలిసింది - రాత్రి హాస్పిటల్‌లో రిక్షా రాములు చనిపోయాడని! ' అయ్యయ్యో ! ఎంత ఘోరం జరిగిపోయింది' అనుకున్నాను. గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్న సూరమ్మ రూపమే నా కళ్ళ ముందు కదలాడింది. అవే ఆలోచనలతో ఆఫీసుకి చేరుకున్నాను.

ఆఫీసులో కొలీగ్స్ అంతా సీరియస్‌గా ఏదో విషయం డిస్కస్ చేసుకుంటున్నారు.

" గురూ! ఏంటి విషయం?" ఫ్రెండ్ సురేష్‌ని అడిగాను.

"అరె! నీకు తెలీదా? మన చీఫ్ మినిస్టర్ 'ఎమ్మెస్సార్' ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మిస్ అయిందట! కర్నూలు దగ్గర అడవుల్లో మాయమైందని అంటున్నారు. పైగా ఈ పాడు తుఫానొకటి, టీవీ చూడ్డం లేదా? " అంటూ నా వైపు ఆశ్చర్యంగా చూసాడు.

నిజంగానే నేను పొద్దున్న టీవీ చూడలేదు. సరాసరి ఆఫీసుకి వచ్చేసాను. అందులోనూ ఈ రాములు సంఘటన కూడా నన్ను డిస్టర్బ్ చేస్తోంది. అందుకే నాకు సి.ఎం. తప్పిపోయిన విషయం తెలియ లేదు. 'ఏమిటో! ఈ రోజు అన్నీ ఇలాంటి విషయాలే వింటున్నాను' అనుకొని ఆఫీసు వర్క్ చేసుకోవడములో మునిగిపోయాను.

●●●

ఆఫీసయ్యాక సాయంత్రం తిరిగొస్తూ సూరమ్మ ఇంటి వైపు వెళ్ళాను. 'బాగా దు:ఖంలో ఉంటుందేమో, ఓదారుద్దాము' అనుకున్నాను. కానీ నా ఊహకి విరుద్ధంగా తను మామూలుగానే ఉంది. ఎందుకో నా ఇగో దెబ్బతింది.

నన్ను చూడగానే " రండి సారూ...రండి...కూకోండి ! " అంటూ ఆహ్వానించింది.

" సూరమ్మా!ఇన్నాళ్ళూ రాములున్నాడు. ఇప్పుడు ఒంటి దానివయ్యావు. ఎలా బ్రతుకుతావో " అన్నాను కూర్చుంటూ.

"హు..." అంటూ నిట్టూర్చి "... పోయినోడితో పాటూ మావూ పోనేం కద సారూ... ఎట్టాగో బతుకుతాం .. ఆ బగమంతుడి దయ..." పిల్లల్ని దగ్గరికి తీసుకుంటూ చెప్పింది.ఎంత విచిత్రం! నిన్నంతా కన్నీరు మున్నీరుగా విలపించిన ఒక స్త్రీ ఈ రోజు ధైర్యంగా వేదాంతం చెబుతోంది. పరిస్థితులు మనుషులకి ఎన్నో పాఠాలు నేర్పుతాయి అంటే ఇదే కాబోలు! ఇక అక్కడ ఉండాలనిపించలేదు. "వస్తాను సూరమ్మా! ఏదన్నా సాయం కావాలంటే అడుగు" అని చెప్పి అక్కడి నుండి రూముకి వచ్చేసాను.

రూముకి రాగానే టీవీ ఆన్ చేసి న్యూస్ చానెల్ పెట్టాను. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఎప్పుడు ఎలా మిస్ అయింది, దాన్ని కనుగొనడానికి ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాల గురించి వర్ణించి వర్ణించి చెబుతున్నారు యాంకర్లు. దానితో పాటూ కొంతమంది రాజకీయ నాయకుల అభిప్రాయాలని, తుఫాను లాంటి ప్రతికూల పరిస్థితులలో హెలికాప్టర్‌ని ఏ విధంగా నడిపించాలి అన్న విషయం మీద అనుభవజ్ఞులైన పైలట్ల విశ్లేషణలని చూపిస్తున్నారు. ఏది ఏమైనా నాకు అసహనంగా అనిపించింది. ఒక ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మిస్ అయితే కనుక్కోవడం ఇంత కష్టం అవుతోందంటే, పురోగమిస్తున్న మన సాంకేతిక వ్యవస్థ మీద అనుమానం కలిగింది. ఈ సాంకేతిక ప్రగతి అంతా కేవలం డబ్బా కొట్టుకోవడానికే తప్ప అవసరానికి పనికిరాదన్నది స్పష్టమవసాగింది.

రాత్రయింది... మా లేబర్ బస్తీలో త్రాగుబోతుల హడావుడి మొదలయింది. తప్పిపోయిన ముఖ్యమంత్రి గురించి, చనిపోయిన రాములు మంచితనం గురించి డిస్కషన్స్ జోరుగా సాగుతున్నాయి. సూరమ్మ ఇంటివైపు చూసాను. ఎవరో ఒక కొత్త వ్యక్తి సూరమ్మతో చనువుగా మాట్లాడుతున్నాడు. ఇకనుండి దానికి వాడేనేమో తోడూ...నీడ! మంచిదే..భగవంతుడు నిజంగానే దయ చూపించాడు. ఎన్నో సంవత్సరాలనుండి కలిసిమెలిసి బ్రతికిన భర్త చనిపోతే విపరీతంగా కన్నీళ్ళు కార్చింది. ఆ కన్నీళ్ళు ఇంకి పోయాయి. వాటితో పాటే రాములు కూడా ఆమె స్మృతిపథం నుండి చెరిగిపోయాడు. బహుశా కన్నీళ్ళ ఉపయోగం అదే అయితే, మరి నా తండ్రి చనిపోతే నాకెందుకు రాలేదు కన్నీళ్ళు? సమాధానం దొరకడం లేదు. అలవాటు ప్రకారం రాత్రి పన్నెండు దాకా చదువుకొని నిద్రపోబోతూ టీవీ చూసాను - అప్పటికి ఇంకా తప్పిపోయిన ముఖ్యమంత్రి జాడ తెలియరాలేదు.

●●●

మరుసటి రోజు మామూలుగా ఆఫీసుకి వెళ్ళి పనిచేసుకోసాగాను. కాసేపటికి ఆఫీసులో కలకలం!

"గురూ సి.ఎం చనిపోయాడంట! హెలికాప్టర్‌కి సిగ్నల్ మిస్ అవడంతో ఏదో కొండను ఢీ కొని కూలిపోయిందట! అతనితో పాటూ ఉన్న మిగతా వాళ్ళు కూడా దుర్మరణం పాలయ్యారు. ఎంత ఘోరం? రెండో సారి కూడా పదవిలోకొస్తే ఎంతో అదృష్టవంతుడనుకున్నాం...ఇలా జరుగుతుందనుకోలేదు... పద, కేంటీన్ వైపు వెళదాం ... అక్కడ టీవీ ఉంది కదా...కాసేపు న్యూస్ చూడొచ్చు! " అంటూ లాక్కుపోయాడు కొలీగ్ సురేష్.

టీవీ లోని అన్ని న్యూస్ చానెల్స్‌లో అదే వార్త!

రాష్ట్రమంతా అలుముకున్న విషాదం! ప్రజల్లో విపరీతమైన దిగ్భ్రాంతి! టీవీలో కింద స్క్రోలింగ్ వస్తోంది - ముఖ్యమంత్రి మరణ వార్త విని ఎంతో మంది అభిమానులు గుండె పోటుతో మరణించారట. నాకు ఆశ్చర్యమేసింది. తమకు రక్తసంబంధీకుడు కాని వ్యక్తి మీద అంతటి అభిమానం నిజంగా ఉంటుందా? లేక కేవలం బలహీన మనస్తత్వం తోనే వాళ్ళు చనిపోయారా? మళ్ళీ సమాధానం తెలీని ప్రశ్న!

టీవీలో ముఖ్యమంత్రి ఇంటిని , అతని కుటుంబ సభ్యుల స్పందనని చూపిస్తున్నారు. అక్కడ అంతటా శోకపూరిత వాతావరణం నెలకొంది. కానీ ఎవరూ ఏడుపులూ, పెడబొబ్బలూ పెట్టడం లేదు. కన్నీళ్ళు వరదలై ప్రవహించడం లేదు. ఎవరికీ గుండెపోటు రాలేదు. అందరి ముఖాల్లోనూ 'బాధను దిగమింగి భవిష్యత్ కార్యాచరణాన్ని రచిస్తున్న' భావనలే కనిపిస్తున్నాయి. స్థితప్రజ్ఞత అంటే అదేనేమో!...తలా తోకా లేని ఆలోచనలు నా బుర్ర నిండా!

" ...రారా బాబూ! ఎక్కడికి వెళ్ళినా ఆలోచనల్లో మునిగిపోతావు " అని సురేష్ అనడంతో ఈ లోకంలోకి వచ్చాను. ఆ తర్వాత ఆఫీసులో కాసేపు కూర్చొని ఏదో పనిచేసాననిపించి ఇంటిముఖం పట్టాను.

సాయంత్రం ఇంటికొచ్చాక కిటికీలో నుండి సూరమ్మ ఇంటివైపు చూసాను. నిన్న ఆమె ఇంటికొచ్చిన 'ఆత్మబంధువు' ఈ రోజు బయట కూర్చొని మందు కొడుతున్నాడు. సూరమ్మ అతడికి 'స్నాక్స్' సప్లయ్ చేస్తోంది. ఎందుకో నాకు నవ్వొచ్చింది. ఆలోచిస్తే, సూరమ్మకు, నాకు పెద్దగా తేడా లేదనిపించింది. తన భర్త చనిపోతే సూరమ్మ ఇంకొక 'ఆధారం' చూసుకొంది. అది ఆమె 'అవసరం'. నేను కూడా నా తండ్రి చనిపోతే పెద్దగా బాధ పడలేదు. ఎందుకంటే వయసుడిగి, జబ్బుతో మంచానపడ్డ నా తండ్రి వలన ఎవరికీ ఏ ఉపయోగమూ లేదు కదా! బహుశా అందుకే ఆయన గురించి నేను ఏడ్వలేదేమో!. ఇక తేడా ఏముంది?

ఏది ఏమైనా మామూలు మనుషుల్లా, నా తండ్రి మరణించినప్పుడు నాకు సహజసిద్ధంగా వచ్చే కన్నీళ్ళు రాలేదు. ఇదేదో నేను ఆలోచించవలసిన సమస్యలానే అనిపించింది. దీనికి కారణాన్ని వీలైనంత తొందరలో కనుక్కోవాలని నిర్ణయించుకున్నాను.

●●●

"డా. మనోభారం, సైకాలజిస్ట్ "

ఆ బోర్డ్‌ని చాలా సేపు పరిశీలనగా చూసి లోనికి వెళ్ళాను. రిసెప్షన్‌లో ఒక అందమైన అమ్మాయి కూర్చొని ఉంది. నన్ను చూడగానే "వెల్ కం సార్! కూర్చోండి" అంటూ ఆహ్వానించింది. నా పేరు, వయసు లాంటి వివరాలు నోట్ చేసుకుని, ముందున్న కంప్యూటర్‌లో ఏదో చూసుకోవడంలో నిమగ్నమైంది. నేను వెయిట్ చేయసాగాను. కాసేపటికి పిలుపొచ్చింది. లోనికి వెళ్ళాను.

"కమాన్ మైడియర్!" అంటూ ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు డాక్టర్‌గారు. షుమారు అరవయ్యేళ్ళ వయసుంటుంది ఆయనకి. ముడతలు పడ్డ చర్మం, తెల్లటి గడ్డం, ముక్కు మీదకు జారుతున్న కళ్ళజోడు, చూడగానే 'మేధావి' అనిపించేలా ఉన్నారు.

" చెప్పండి ఏమిటి మీ సమస్య? " అనునయంగా అడిగారు.

కొంతసేపు తటపటాయించాను. తర్వాత నెమ్మదిగా చెప్పాను. " నాకు...నాకు...కన్నీళ్ళు రాలేదు సార్!"

"ఓహో...అలాగా...మంచిదే కదా! అందులో సమస్యేముంది?" సున్నితంగా అడిగారు.

"అది కాదు డాక్టర్ గారూ! ఊళ్ళో ఉంటున్న మా నాన్నగారు ఈ మధ్యనే చనిపోయారు. చూడ్డానికి వెళ్ళాను. కానీ అదేమిటో నాకు ఏడుపు రాలేదు. అదీ నా సమస్య!"

అర్థమైందన్నట్లు నెమ్మదిగా తల పంకించి అడిగారు." బ్రతికున్నప్పుడు మీ నాన్నగారు మీతో సన్నిహితంగా మెలిగేవారా? "

"లేదు డాక్టర్ గారూ! అందుకు అవకాశమే లేకుండా పోయింది. చిన్నతనం నుండి నేను హాస్టల్‌లోనే చదివాను. అప్పుడప్పుడు ఇంటికి వెళుతున్నా ఆయనతో మాట్లాడేది చాలా తక్కువ. మా అమ్మతోనే నాకు ఎక్కువ మాలిమి. " చెప్పాను

" మరి మీరు పెద్దయి జాబ్‌లో జాయిన్ అయ్యాక ఎలా ఉండేవారు?" ఆసక్తిగా అడిగారు

" అప్పుడు కూడా ఎక్కువగా మాట్లాడే వారు కారు. ఒక స్కూల్లో టీచర్ తన విద్యార్థితో మాట్లాడుతున్నట్లు మాట్లాడేవారు." చెప్పాను.

చాలాసేపు ఆయన ఏమీ మాట్లాడలేదు. కాసేపటికి గాఢంగా నిశ్వసించి చెప్పడం మొదలు పెట్టారు.

"చూడు బాబూ! నీ సమస్య చాలా చిన్నది. నీవు అనుకునేంత వైపరీత్యమేమీ లేదు. సాధారణంగా ఎవరికైనా తమకు అత్యంత ఆత్మీయులైన వారు మరణిస్తే దు:ఖం కలుగుతుంది. అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే కన్నీళ్ళు రావడం, రాకపోవడం అనేది వారి వారి మానసిక స్థాయిని బట్టి ఉంటుంది. కొంతమంది విపరీతంగా ఏడ్చి, చాలా తొందరగా మర్చిపోతారు. కొంతమంది అస్సలు ఏడ్వరు, కానీ ఆ వ్యక్తిని చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు. అయితే నీ సమస్య ఈ రెండింటికీ భిన్నమైనది. చిన్నతనం నుండీ

నీవు ఇంటికి దూరంగానే పెరిగావు. దానివలన నీ తల్లిదండ్రులతో నీకున్న సంబంధం పూర్తిగా మానసికమైనది. వాళ్ళపై నీకున్న ప్రేమ కూడా కేవలం ఊహల్లోనే పెరిగి పెద్దదైంది. భౌతికంగా వాళ్ళపై ప్రేమ చూపించడానికి నీకు అవకాశం లేకపోయినా మానసికంగా వాళ్ళని విపరీతంగా ప్రేమిస్తూనే ఉన్నావు. అందుకనే నీ తండ్రి భౌతికంగా మరణించినప్పటికీ, మానసికంగా ఆయన నీ దృష్టిలో ఇంకా బ్రతికే ఉన్నారు. ఆ ఫీలింగ్ నుండి బయట పడి వాస్తవాన్ని జీర్ణించుకోవడానికి నీ మనసు ఒప్పుకోవడం లేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నీవు ఒక ఇల్యూజన్‌లో ఉన్నావు, అందుకే నీకు కన్నీళ్ళు రావడం లేదు! " చెప్పడం ముగించి నా వైపు సాలోచనగా చూసారు.

" అంటే దీని గురించి నేను ఆలోచించడం ఇక అనవసరమంటారా? " సందేహంగా అడిగాను.

"కరక్ట్‌గా అర్థం చేసుకున్నావు. నేనూ అదే చెబుదామనుకుంటున్నాను. పోజిటివ్ ఇల్యూజన్ మంచిదే! దానివలన మనకి వచ్చే నష్టం ఏమీ లేదు. ఇక దీని గురించి ఏమీ వర్రీ కాకుండా హాయిగా లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యి...ఆల్ ది బెస్ట్!" అని చెప్పి షేక్ హ్యాండిచ్చారు. ఆయనకు ఫీజు చెల్లించి నేను బయట పడ్డాను.

ఇప్పుడు చాలా రిలీఫ్ గా ఉంది. నా తండ్రి గుర్తొచ్చి పెదాలపై చిరునవ్వు కదలాడింది!.

●●●

Click here to share your comments on this story